## కేసీఆర్ వస్తేనే.. రాష్ట్రం ప్రశాంతం

- బీఆర్ఎస్‌కే మజ్లిస్ సంపూర్ణ మద్దతు
- కాంగ్రెస్, బీజేపీలు బయటకుమాత్రమే శత్రువులు
- రెండు పార్టీల మధ్యన చీకటి ఒప్పందం
- ముస్లింలంతా బీఆర్ఎస్‌కే ఓటు వేయండి
- సబితాఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- షాహిన్‌నగర్ సభలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహిన్ నగర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

బడంగ్‌పేట, నవంబర్ 28 : కాంగ్రెస్, బీజేపీలు బయటకు మాత్రమే శత్రువులుగా కనిపిస్తాయి కానీ.. రెండు పార్టీలు ఒక్కటేనని, వారి మధ్యన చీకటి ఒప్పందం ఉన్నదని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మైనార్టీల అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి షాహిన్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీ అసద్దుదీన్ ఒవైసీ హాజరై ప్రసంగించారు. మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి పటోళ్ళ సబితా ఇంద్రారెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తున్నదని, జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. ఐటీ సంస్థల ఏర్పాటుతో అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న బీఆర్ఎస్ వైపే నిరుద్యోగులు నిలువాలని పిలుపునిచ్చారు. ఐటీ హబ్‌లో లక్షల ఉద్యోగాలు వస్తాయని మైనార్టీలకు బరోసా కల్పించారు. హైదరాబాద్ పేరు మారుస్తామని చెబుతున్న బీజేపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ విష ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు ఎట్టి పరిస్థితుల్లో ఓట్లు వేయవద్దని, రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కే ముస్లిం, మైనార్టీలు ఓటు వేయాలని, మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అయితేనే రాష్ట్రం ప్రశాంతంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేస్తే నగరంలో అలజడి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దులా సాదీ, మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఇక్బాల్ ఖలీఫా, ఈసూఫ్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు, ఎంఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ మెజార్టీతో నందకిశోర్ విజయం ఖాయం

రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ జగన్‌మోహన్‌రావు



గోషామహల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు

అబిడ్స్, నవంబర్ 28 : గోషామహల్‌లో బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌పై బీఆర్ఎస్ అభ్యర్థి 25వేల మెజార్టీతో విజయం సాధిస్తారని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మంగళశారం గోషామహల్, ఆగాపురా, టక్కరివాడి, గ్యాన్‌బాగ్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తంరావుతో పాటు పలువురు నాయకులతో కలిసి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమైందన్నారు. అన్ని ప్రాంతాల్లో రాజాసింగ్‌పై ప్రజలంతా తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారంలో ఇంటింటికి వివరించి ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. దాదాపు 25వేలకు పైగా మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తంరావు, సురేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

---

> బెంగళూరు నగరంలో ట్రాఫిక్ నరకం... హైదరాబాద్ నగరంలో విశాలమైన రహదారులు
>
> - ఓ నెటిజన్ స్వీయానుభవం

> హైదరాబాద్ నగరంలో తిరుగుతుంటే న్యూయార్క్‌లో ఉన్నట్లుగా ఉంది
>
> - తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కితాబు

> 90 దశకంలో ఇక్కడికి వచ్చాను... అప్పటికి ఇప్పటికీ హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందింది. ఇక్కడే స్థిరపడాలని పిస్తుంది.
>
> - బీజేపీ ఎంపీ సన్నీడియోల్ ప్రశంస

> బెంగళూరులో మౌలిక వసతులు, ప్రభుత్వ పాలసీలు బాగా లేవు. హైదరాబాద్‌లో మౌలిక వసతులు బాగున్నాయి.. ఇక్కడి ప్రభుత్వ పాలసీలు ఉత్తమంగా ఉన్నందునే కంపెనీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం
>
> -కీన్స్ సీఈవో రాజేశ్ శర్మ బహిరంగ వ్యాఖ్య

# గ్రేటర్ గడ్డ.. గులాబీ అడ్డా..!

- మహా నగరంలో.. గులాబీ రెపరెపలు
- ఏ ఓటరును కదిలించినా అభివృద్ధి మంత్రమే
- 21 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు స్పష్టమైన మొగ్గు
- మునుపటికంటే ఒక సీటు ఎక్కువనే ఖాతాలో వేసుకునే అవకాశం
- 2014-2018 ఓటింగ్ సరళిలోనూ అభివృద్ధికే పట్టం



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): గత తొమ్మిదిన్నరేండ్ల హైదరాబాద్ అభివృద్ధికి జాతీయంగా, అంతర్జాతీయంగా వచ్చిన ప్రశంసలు కొన్ని. మరి.. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఒక సగటు నగరవాసికి ఇంతకంటే గర్వకారణం ఏముంటుంది?! అందుకే నిత్యం సోషల్ మీడియాలో హైదరాబాద్ అభివృద్ధి చిత్రాలు పోస్టింగ్ చేసేందుకు నగరవాసులు పోటీ పడుతున్నారు. తమ సృజనాత్మకతను జోడించి మురిసిపోతున్నారు. ముఖ్యంగా దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలుస్తూ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చ అనేది నిత్యం ఓ ట్రెండింగ్. అందుకే హైదరాబాద్ మహా నగర పరిధిలోని వారందరూ ఈ అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్నారు.. ఆస్వాదిస్తున్నారు. ఇదే తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రతిఫలిస్తున్నట్లుగా కనిపిస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇతర రాజకీయాంశాలు ఎలా ఉన్నా.. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను బేరీజు వేసినా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (షాద్‌నగర్‌తో కలుపుకొని) పరిధి రాజకీయ ముఖచిత్రంపై అభివృద్ధి అనేది ఆది నుంచి సామాన్యుడి ఎజెండాగా ఉంటుందనే వాస్తవం అర్థమవుతుంది. ఈ క్రమంలో దాదాపు 21 నియోజకవర్గాల్లో గులాబీ పార్టీకి మొగ్గు ఉన్నదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ హైదరాబాద్ అభివృద్ధి అనేది ప్రతి ఎన్నికల్లో ఒక ఎజెండాగా వస్తున్నది. అంతే కాదు.. ఇక్కడి అభివృద్ధి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపైనా ప్రభావం చూపుతున్నదని గత ఎన్నికల్లోనూ వెల్లడైంది. ఈ క్రమంలో ఉమ్మడి ఏపీలో జరిగిన 2014 ఎన్నికల్లో హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 14 నియోజకవర్గాలు.. హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే షాద్‌నగర్ నియోజకవర్గం (తాజాగా రంగారెడ్డి జిల్లా) ఇలా 30 నియోజకవర్గాలను ప్రామాణికంగా తీసుకుంటే అభివృద్ధి వైపు ఓటర్లు ప్రభావితులవుతున్నట్లుగా తెలుస్తున్నది. 2014 ఎన్నికల్లో 30 నియోజకవర్గాల్లో సుమారు 95.10 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఆ ఎన్నికల్లో సరాసరిన 55శాతం పోలింగ్ నమోదైంది. పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాలు మజ్లిస్ కంచుకోటగా ఉన్నాయి. కాగా ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 23.28 శాతం ఓట్లు రాగా.. తెలుగుదేశం పార్టీకి 20.31 శాతం, కాంగ్రెస్‌కు 17.36 శాతం, బీజేపీకి 12.45 శాతం ఓట్లు వచ్చాయి. సీట్లపరంగా బీఆర్ఎస్‌కు ఐదు సీట్లు మాత్రమే రాగా.. టీడీపీకి పదకొండు, బీజేపీకి ఐదు, కాంగ్రెస్‌కు రెండు సీట్లు వచ్చాయి.

### గులాబీ పార్టీకి బ్రహ్మరథం

తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నాలుగున్నర సంవత్సరాల్లోనే నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. దీంతో తదుపరిగా 2018లో వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు గులాబీ పార్టీకి బ్రహ్మరథం పట్టారు. ఆ ఎన్నికల్లో 30 నియోజకవర్గాల్లో సుమారు 95.28 లక్షల మంది ఓటర్లు ఉంటే.. సరాసరిన 56శాతం పోలింగ్ నమోదైంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి ఏకంగా 41.35శాతం ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 23.69శాతం, బీజేపీకి 11.95శాతం ఓట్లు వచ్చాయి. సీట్లపరంగా బీఆర్ఎస్ 20స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలకే పరిమితం కాగా బీజేపీ ఒక్క స్థానంతో సంతృప్తిపడాల్సి వచ్చింది. అంటే 2014తో పోలిస్తే.. బీఆర్ఎస్‌కు అభివృద్ధి మంత్రం ఎంతగా పని చేసిందో అర్థం చేసుకోవచ్చు.

### అభివృద్ధి పట్ల పెరిగిన మరింత అవగాహన

గతంలో పోలిస్తే హైదరాబాద్ మహా నగరవాసుల్లో అభివృద్ధి పట్ల అవగాహన, సామాజిక స్పృహ గణనీయంగా పెరిగింది. ఇందుకు సోషల్ మీడియా రావడం ఒక వంతైతే.. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రావడం, మౌలిక వసతులు భారీగా వచ్చి వాటి ఫలాలు కండ్లారా చూడటంతో వాటి పట్ల అవగాహన గణనీయంగా పెరిగింది. దీంతో సోషల్ మీడియాలో ఇతర నగరాల పరిస్థితి కూడా క్షణాల్లో తెలవడం, నగరాల మధ్య అభివృద్ధిపై బేరీజులు.. తద్వారా చర్చలు జరగడంతో ప్రభుత్వాల పనితీరు ఎలా ఉండాలి? అభివృద్ధితో జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయనే విషయం సామాన్యుడికి సైతం అర్థమైంది. ఈ నేపథ్యంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి.. అదే తరుణంలో పొరుగున ఉన్న రాష్ట్రాల్లోని నగరాల పరిస్థితి.. అందునా బెంగళూరు నగరంలో మౌలిక వసతుల కల్పన లేక ఎలా డీలా పడిందనే వివరాలు అందరి స్పృహలో ఉన్నాయి. దీంతో రాజకీయాంశాల కంటే అభివృద్ధి అనేది ప్రజల్లో ప్రధాన ఎజెండాగా మారింది. అదే ఎన్నికల్లోనూ ఓటర్లను ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే 30 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు 21 స్థానాల్లో అనుకూల వాతావరణం ఉన్నదని వారు విశ్లేషిస్తున్నారు.

---

## కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

- బీఆర్ఎస్‌కే ఎన్‌పీపీ సంపూర్ణ మద్దతు
- పాంథర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

సుల్తాన్‌బజార్, నవంబర్ 28 : రాష్ట్ర సాధన కోసం వీరోచిత పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్‌కే ఓటు వేసి హ్యాట్రిక్ సీఎంగా గెలుపించాలని నేషనల్ పాంథర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి కేఎస్ కృష్ణ అన్నారు. మంగళవారం ప్రచార ఘట్టం ముగియనున్న సందర్భంగా ఆయన నగరంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి అమర వీరుల సాక్షిగా సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ప్రజలను కోరారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేయడంతో పాటు సకజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చిన సందర్భంగా నేషనల్ పాంథర్స్ పార్టీ కూడా రాష్ట్ర సాధన కోసం సంపూర్ణ మద్దతు పలికిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి దేశంలో మరే రాష్ట్రంలో జరగలేదని అన్నారు. రైతుల అభ్యున్నతితో పాటు సబ్బండవర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణలో ఇస్తున్న హామీలను ఏ రాష్ట్రంలో నెరవేర్చలేదని, ఈ బూటకపు మాటలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోవద్దని తెలిపారు. నేషనల్ పాంథర్స్ పార్టీ దేశంలోని అన్ని రాష్ట్రాలను ప్రత్యేకంగా గమనిస్తున్నదని, తెలంగాణలో జరిగిన అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని అన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం త్యాగించేందుకు సిద్ధమైన సీఎం కేసీఆర్ వంటి ఉద్యమ నాయకుడికే తెలంగాణ ప్రజలు మరోమారు పట్టం కట్టాలని, లేని పక్షంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ పరుల పాలవుతుందని హెచ్చరించారు.



ప్రత్యేక పూజలు నిర్వహించిన కేఎస్ కృష్ణ